ఎదురు చూస్తున్న తన తల్లితో, "మామయ్య వన్నీ అబద్ధాలే! పంది శకునం మంచిదన్నాడు. అదే యింత పని చేసింది," అని శేషు అంది, వరికిణా నీళ్ళు పిండుకుంటూ.

(జూలై 1942)

---

# పెన్సిల్

అమ్మా నాన్నా అలా మాటులు ముడుచుకు కూచోడం వసంత్ కి నచ్చలేదు. వీళ్ళపోట్లాటలు కాదుగాని తల ప్రాణం తోకకి వస్తోంది. ఇద్దరి మధ్యానలిగి తను నానాయిడీ అయిపోతున్నాడు.

తన పెన్సిల్ పోయిందనీ కొత్తపెన్సిల్ కావాలనీ అమ్మతో చెప్పాడు. "నాకు తెలీదు— మీనాన్నని అడుగు," అనిబుస్సుమంది. నాన్న దగ్గిరికివెళ్ళి "నాన్నా నాన్నా, నాకుపెన్సిల్ కావాలి" అంటే, "వెధవా., యిన్నాళ్ళనుంచీ పెన్సిళ్లు నేనిస్తున్నానా! నువ్వూకూడా అమ్మపక్షం చేరి నాటకం మాడుతున్నావా"? అని కస్సుమన్నాడు.

వసంత్ తన చిన్న కుర్చీమీద కూచుని, తన చిన్న రాతబల్లమీద రెండు చేతులూ ఆనించి ఆలోచించడం మొదలెట్టాడు. ఇవ్వాళ ఆదివారం. అప్పుడే పదకొండుదాటింది. సాయంత్రం స్కూల్లో ఆటలకి పోవాలి. మధ్యాహ్నం మొదలియార్ గారింటికివెళ్ళి గులాబ్ జామ్ తినాలి—వాళ్ళబ్బాయి రమ్మనమని మరీమరీ చెప్పాడు. ఆ జామెట్రీ బొమ్మలు రేపుచూపించకపోతే బెంచి ఎక్కిస్తాడు లెక్కలమేష్టరు! ఇంకా లెక్కలు పూర్తిచేసుకోవాలి; స్నానంచెయ్యాలి; అన్నం తినాలి; బట్టలు వేసుకోవాలి. గడియారం అరగంట కొట్టింది. తన మొహాన ఒక పెన్సిల్ పారేసి, అమ్మానాన్నా యింట్లో రెండురోజులు పోట్లాడుకున్నా తనకి యిబ్బంది లేదు.

వంటమనిషి దగ్గిరికి వెళ్ళాడు వసంత్. "అవ్వా! అవ్వా!! అమ్మా నాన్నా అలావున్నారేం!" అన్నాడు. అవ్వకి కొద్దిగా చెవుడు. ఘట్టిగా చెప్పమని చెవి చూపింది. వసంత్ "అమ్మానాన్నా అలావున్నారేం!" అని బిగ్గిరిగా అరిచాడు. అదే సమయంలో నాన్న తువాలు భుజంమీద వేసుకుని హాల్ రూంలోకి వస్తున్నాడు. నాన్నని క్రీగంట

చూసి వసంత్ తనగదిలోకి తుర్రుమన్నాడు... ఛా! తను పెద్దయినాక చెవిటివంటమనిషి.నిమాత్రం పెట్టుకోడు...నాన్న విన్నాడేమో కూడాను.... వసంత్ తనగదిలో మంచంమీద కూచున్నాడు. గడియారం గణగణ పన్నెండుకొట్టింది. పాడు టైము...ఎంతవేగంగా పరిగెడుతోందీ! తనకి పెన్సిల్ లేదు. ఇల్లంతా మారుమ్రోగేటట్లు ఒక్క-సారి 'పెన్సిలో!' అని అరవాలనిపించింది. తనకేదో పిచ్చిపట్టిందని అమ్మానాన్నా కలిసిచావమోదుతే!

మునుపెప్పుడూ అరడజను పెన్సిళ్ళుంచేది అమ్మ తన పెట్లో! ఇప్పుడు గీసిగీసి అడిగితేగాని ఒక్కటికూడా యివ్వడం లేదు. యుద్ధంఅంటుంది. పెన్సిళ్ళతో యుద్ధాలు చేస్తారా—వొట్టి అబద్ధం గాని. అమ్మ ఈ మధ్య అబద్ధాలకోరు అయిపోతోంది. అమ్మ మంచిదికాదు—నాన్నే మంచివాడు...నాన్నమాత్రం? రంగుల స్వెట్టర్ కొని పెడితేగాని స్కూలుకి వెళ్లనని ఏడ్చినరోజున వీపు చిట్లగొట్టాడు. ఇద్దరూ యిద్దరే! ఈ అమ్మానాన్నా అసలు మంచివాళ్ళు కారు...మరి... పెన్సిల్...

వసంత్కి ఆకలివేళ తప్పిపోయింది. పెన్సిల్

మనవాడి మరో ఆలోచన లేదు/ జుట్టు పీకేసుకుని, వొళ్ళు రక్కేసుకుని, పుస్తకాలు కిటికీలోనుంచి గిరవాటువేసి, బట్టలు బ్లేడుతో తునకలుగాచేసి, దీపావళీనాడు మిగిలిన మతాబులు ఆ మంచం మీద కూచుని కాల్చాలనిపించిందీ. ఇల్లంటు కుంటుందేమో! మొన్న సినిమాలో చూసినట్లు ఆ కిటికీలోనుంచి దూకేస్తాను. బాబోయ్! బుర్ర గిర్రున తిరిగిపోతోంది.

"వసంతా, యింకా అన్నం తినలేదేమిరా!" అంటూఅమ్మగదిలోకి వచ్చింది. కంఠంమామూలు స్థాయిలో లేదు. పలుకులో కాఠిన్యతవుంది.

"నాకు పెన్సిల్ కావాలి."

"అన్నం తి న లే దే మ ని అడుగుతున్నా." సూటిగా సమాధానం చెప్పమని తల్లిఆజ్ఞ.

వసంత్ జవాబు చెప్పలేదు.

"స్నానం చేశావా?"

వసంత్ కళ్ళువప్పజెప్పి చూస్తున్నాడు.

"గుడ్డి గుర్రాలకి పళ్ళు తోముతున్నావా?" ఉరిమిచూసింది తల్లి.

"పెన్సిల్ ... ..."

ఛెళ్ళున తగిలించింది అమ్మ. వసంత్ బావురు

మన్నాడు. దెబ్బతగిలి, కాదు; పొద్దుట్నుంచీ పెన్సిలో అని అఘోరిస్తావుంటే తన మొర ఆలకించి ఒక పెన్సిల్ మొహాన పారెయ్యలేక సరిగదా— అమ్మా నాన్నా దెబ్బలాడుకు మధ్యని తన నెందుకు కొట్టాలి ?—అని వుక్రోషం. ఆ వుక్రోషంతో కుయ్యోమొర్రో మంటూ బిగ్గిరిగా అరిచాడు.

"— పైకి ఏడవవుకదా!" అంటూ మరో ఘురకి తగిలించింది అమ్మ.

యావచ్ఛక్తితోటీ ఏడుపందుకున్నాడు కథానాయకుడు. ఇంట్లో యిక భోంచెయ్యకూడదనీ, కాశ్యాలికి సన్యాసం పుచ్చుకుందామనీ తీర్మానించుకుని గడపదాటబోతున్న నాన్న కర్ణరంధ్రాలలోకి ఈ బాలకుడి దీనాలాపములు ప్రవేశించగా, అతడు తత్క్షణం రంగస్థలం ఖాదికి హనుమంతుడిలా వురికాడు. వసంత్ నాన్నని చూసీ చూడగానే అతని రెండు కాళ్ళూ పెనవేసుకుని, యింకా యింకా ఏడవడం మొదలెట్టాడు.

"వూరుకో, నాయనా, వూరుకో, మనరోజులు తప్పివచ్చాయి," అంటూ కుమారరత్నాన్ని సముదాయించడానికి పూనుకున్నాడు నాన్న. అమ్మ వసంత్ వంక చురచురచూసింది.

"నన్ను కొట్టలేక వాణ్ణికొట్టావ్!" అన్నాడు నాన్న అమ్మతో.

"అబద్ధపుమాటలాడకండి. ఇప్పుడు దగ్గిరి దగ్గిరిగా ఒంటిగంట అవుతోంది. ఇంతవరకూ స్నానం లేదు; తిండి లేదు. అలా గోళ్ళుగిల్లుకుంటూ కూచున్నాడు. పిల్లల్ని కాస్తగదమాయించి, భయం చెప్పకోకపోతే, వాళ్ళెందుకయినా అక్కర కొస్తారా?"

"వాడివొళ్ళు కందిపోయింది."

"మీ కేతెండి మహాప్రేమ వుంది... చెప్పొచ్చారు......"

"పిల్లల్ని కొట్టకూడదు," అన్నాడునాన్న.

"పిల్లాడి పెంపకం విషయంలో మీరు జోక్యం కలుగ జేసుకోకూడదు," అంది అమ్మ.

"వాడికన్నీళ్లుచూస్తే కడుపుతరుక్కుపోతోంది."

"కన్నతల్లికంటేనా......?"

ఇద్దరి మొహాల వంకా వంతుల ప్రకారం చూస్తున్న వసంత్ ని వుద్దేశించి "వసంత్ అమ్మ మంచిదా, నేను మంచివాణ?" అన్నాడు నాన్న.

"నాకు ఎవరు పెన్సిల్ యిస్తే వాళ్ళు" అన్నాడు వసంత్.

అమ్మా నాన్నా బిక్క మొహాలతో ఒకళ్ళ నొకళ్ళు చూసుకున్నారు.

"అన్నం చల్లారిపోతోంది," అంది చెవిటిఅవ్వ, గుమ్మందగ్గిరికివచ్చి. అమ్మనీ నాన్ననీ చెరోచేత్తోనూ పుచ్చుకుని వంటింట్లోకి నడిచాడు వసంత్.

ఆసాయంత్రం వసంత్ ఆటలనుంచి తిరిగి వచ్చే టప్పటికి సొరుగులో ఆరు పెన్సిళ్ళూ, తలగడకింద ఆరుపెన్సిళ్ళూ వున్నాయి.

(అక్టోబరు 44)

---

# రైలులో

పూనాస్టేషనులో మా వాడు నన్ను రయిల్లో దూర్చాడు. ఈ రయిలువాళ్లు—మీరు ప్రయాణం చెయ్యద్దో!—అని అఘోరిస్తున్నారు కనక, స్థలం లేదనే కంప్లయింట్ అనుచితం. టికెట్ దొరక డమే మహాద్భాగ్యం.

నేనంటే దూరాను గాని నా పెట్టె, హోల్డాలూ, కారియరూ ఎలా? నోట్లో ఈలా, చేతిలో జండాతో గార్డు యములాసీలా, రెడీగా వున్నాడు. మా వాడు